# ఒక మంత్రి కథ

రామభద్రంగారింట్లో శంకరం ఒక సమస్యగాపరిగణించబడుతున్నాడు. ఆయనకు ఇద్దరు కూతుళ్లూ, ముగ్గురు కొడుకులూ ఉన్నారు. శంకరం ఆఖరి వాడు.

శంకరానికి తెలివితేటలు తక్కువ. బద్ధకం ఎక్కువ. కానీ వాడిలో ఏదో ప్రత్యేకత ఉన్నదని తెలుసుకోడానికి తండ్రికి చాలా కాలం పట్టింది.

చిన్నతనంనుంచీ వాడు దుడుకు మనిషి. వద్దన్న పని చేయడం సరదా.

చిన్నపిల్లలు రేడియో ముట్టుకోకూడదు అని తండ్రిచెబితే ఏదో టైములో వెళ్ళి రేడియోను ముట్టుకోవడమేకాక స్విచ్ ఆన్ చేసి కూడా వచ్చేవాడు శంకరం.

అంతేకాకుండా తల్లిదండ్రులు వాడి గురించి ఏమే విషయాలకు భయపడుతున్నారో తెలుసుకుని ఆ పనులు చేస్తుండే వాడతను.

రామభద్రం పొరుగింట్లో సూర్యారావుంటున్నాడు. వాళ్ళ దొడ్లో మామిడి చెట్టు ఆ సంవత్సరం బాగా కాసింది. సూర్యారావు కాస్త గొడవ మనిషి.

"వాళ్ళ చెట్టు బాగా కాసింది. మన శంకరంగాడి కన్ను దానిమీద పడుతుంది. సూర్యారావుతో గొడవపడాల్సి వస్తుంది." అని రామభద్రం భార్య దగ్గర భయపడ్డాడు.

అది విన్న శంకరం ఒకరోజు రహస్యంగా సూర్యారావు దొడ్లో ప్రవేశించి చెట్టెక్కి అప్పుడు దొరికిపోయాడు పెద్ద గొడవయింది.

స్కూల్లో కూడా శంకరం తోటి కుర్రాళ్ళని కొట్టడమో, ఏడ్పించడమో చేసేవాడు. టీచర్స్‌ని ఎదిరించేవాడు. తండ్రిభయపడినట్లే ప్రోగ్రెస్ రిపోర్ట్సులో తండ్రికి బదులు తనే సంతకాలు పెట్టేవాడు.

అయితే శంకరంలో విచక్షణఉన్నది. అది తండ్రికి ఎప్పుడో కానీ తెలియలేదు.

"నూతిలోపల ఊబి ఉన్నది. మనవాడు నూతి గోడ ఎక్కుతుంటాడు. అందులో పడతాడేమోనని భయంగా ఉంది. పడితే ప్రాణాలు దక్కవు." అని తండ్రి భయపడితే శంకరం ఆ తర్వాత నూతిగోడ ఎక్కలేదు.

"ఇంట్లో చాలా చోట్ల కరెంటుతీగలు బయటకు వచ్చాయి. మనవాడు ముట్టు

వసుంధర



కుంటాడేమో" అని తండ్రి భయపడ్డాడు శంకరం ఆ తీగల జోలికి వెళ్ళలేదు.

బళ్ళో కూడా అతడు తనకంటె బలహీనుల్నీ, ఆర్థికంగా తక్కువవారినీ మాత్రమే బాధించేవాడు. తనకంటె బలవంతులతో స్నేహంచేసి వారిసాయంతో తనకు నచ్చని బలవంతుల్ని ఎదిరించగలిగేవాడు.

టీచర్స్ నెదిరించడంలో అతడికే ప్రమాదమూ కనబడలేదు. అతడికి చదువు గురించిన బెంగలేదు.

రామభద్రం ఆ ఊరి పెద్దల్లో ఒకడు ఆయనకు భూములున్నాయి. డబ్బుంది. అందువల్ల ఊళ్ళో ఆయనంటే గౌరవముంది. ఆ గౌరవం శంకరానికి శ్రీరామరక్షగా ఉంటుంది.

శంకరం పెరిగి పెద్దవాడయ్యాడు. టెన్తుక్లాసు తప్పాడు. రెండు ఛాన్సులకు మించి చూడనన్నాడు-తండ్రి భయపడి నట్లే!

రామభద్రం కొడుకును వ్యాపారంలో పెట్టి-పెట్టుబడే తినేస్తాడేమోనని భయపడ్డాడు. శంకరం అదే పని చేశాడు.

"దుడుకు వెధవ-త్వరగా పెళ్ళి చేయకపోతే-ఇంటిలో ఏ పనిపిల్ల చేయో పట్టుకుంటాడు" అని తల్లి భయపడితే శంకరం ఆ పని కూడా చేశాడు.

ఇంక లాభంలేదని తల్లిదండ్రులతడికి పెళ్ళి సంబంధం చూశారు. రామభద్రం డబ్బును చూసి సాటి కులస్థుడయిన ఓ పేద తండ్రి శంకరానికి పిల్లనిచ్చాడు. పిల్లపేరు జానకి. చక్కని చుక్క.

శంకరానికి జానకి నచ్చింది. ఆ మోజులో వాడి దుడుకుపనులు కాస్త తగ్గాయి. అయితే ఊళ్ళో అనుకోకుండా ఒకరోజున అతడికి పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు కొడుకు సీతారామంతో పెద్ద గొడవ వచ్చింది. రెండు రోజుల్లో సీతారామాన్ని చంపేస్తానని శంకరం ప్రతిజ్ఞచేశాడు.

ఇది విని తండ్రి హడిలిపోయాడు. కొడుకును పిలిచి మందలించాడు.

"పవిమందిలో పరువు నిలబెట్టుకునేందుకు లక్ష ప్రతిజ్ఞలు చేస్తాం కానీ అవి నిలబెట్టుకుని నా పీకలమీదకు తెచ్చుకుంటానా?" అన్నాడు శంకరం.

శంకరం నిజమే చెప్పాడు. అతడు మళ్ళీ సీతారామం గురించి ఆలోచించనే లేదు.

అప్పుడు రామభద్రం బుర్రలో ఏదో మెరిసింది. ఇంతకాలం కొడుకుగురించి తను సరైన అంచనావేయలేకపోయాడు.

శంకరం ఎలాంటి దుడుకుపనిచేసినా అందువల్ల ఇతరులకు మాత్రమే నష్టముంటుంది. తనకు నష్టం కలిగేపని అతడు చేయడు.


కొడుకును రాజకీయాల్లో ప్రవేశపెట్టాలని రామభద్రానికి అప్పుడేస్ఫురించింది.

ఆ సమయంలో ఆయనకు గంగాధరం స్ఫురించాడు.

గంగాధరానికిప్పుడు యాభైఏళ్ళ వయస్సుంటుంది. ముప్ఫైఏళ్ళవయస్సు నుంచీ రాజకీయాల్లో ఉంటూ పదవి కోసం ఎన్నో పార్టీలు మార్చాడు

కానీ పదవిమాత్రం ఆయనకుదొరకలేదు. చాలాసార్లు వచ్చినట్లే వచ్చిపదవి ఆయనకు చిక్కకుండాపోయింది. అన్నీ ఆలోచించి. చివరకు విసిగిపోయి, గంగా






ధరం ఏడాది క్రితమే కొత్తపార్టీపెట్టాడు ఆయన పార్టీ పెట్టిన వేళావిశేషమేమో కానీ అప్పుడే అధికారపక్షంలో చీలికలు రాసాగాయి. కొన్ని ప్రతిపక్షాలు ఆయన పార్టీలో కలిసిపోయాయి. గంగాధరం గాలి తనకు అనుకూలంగా ఉన్నదని గ్రహించి దేశమంతా పాదయాత్ర చేశాడు. పాతాళానికి కృంగిపోయిన మన ఆర్థిక వ్యవస్థను ఆకాశానికెత్తేస్తానని శపథంచేశాడు. క్రమంగా వాతావరణం ఆయనకు అనుకూలంగా మారుతోంది. ప్రజలుకూడా ఒకేపార్టీ పాలనలో విసిగిపోయి ఉన్నారు. వారు మార్పును కోరుతున్నారు.

గంగాధరం దేశసంచారం చేస్తూ రామభద్రం ఊరు వచ్చాడు.

"గంగాధరం కాళ్ళమీద పడితేతప్ప శంకరానికి మోక్షముండదు–" అని రామభద్రం భార్యతో అన్నాడు.

గంగాధరం నిండు సభలో ఉపన్యసించడం అయ్యాక శంకరం ఆయన ముందుకు వెళ్ళి చటుక్కున కాళ్ళమీద పడిపోయాడు.

గంగాధరం ముందు ఉలిక్కిపడి తర్వాత ఆశ్చర్యపడి" ఎవరితడు?" అన్నాడు.

అప్పుడు రామభద్రం ఆయనకు శంకరంగురించి క్లుప్తంగా చెప్పాడు. "మావాడికి మీరంటే ఆరాధన ఉన్నదని నాకు తెలుసు. కానీ మరీ ఇంతలా పెరిగిపోయిందని నాకు తెలియదు. మావాడికి భక్తి కుదిరిందంటే మరీ మూఢభక్తి" అన్నాడాయన.

గంగాధరం రామభద్రం ఇంటికి భోజనానికి వెళ్ళాడు కుతూహలంగా శంకరం గురించి మరిన్ని వివరాలడిగి తెలుసుకున్నాడు. అప్పుడు "ఈనియోజక వర్గానికి మాపార్టీ సీటు మీవాడిదే" అన్నాడు.

"మావాడు ఎమ్మెల్యేనా? ప్రజలు వాడికి ఓటు వేస్తారా?" అన్నాడు రామభద్రం సందేహిస్తూ.

"నిలబడ్డవాడు ఎంతచేతకాని వాడయినా సరే-నాయకుడి ముఖంచూసి ఓటు చేయడం మన ప్రజల సంప్రదా

యం. మీరేమీ భయపడకండి-" అన్నాడు గంగాధరం.

ఆ తర్వాత శంకరం ప్రజలముందు నిలబడి ప్రజలకోసం తానేమి చేయ దల్చుకున్నాడో వాగ్దానాల రూపంలో చెప్పి-గంగాధరం నీడలో ఎమ్మెల్యే అయ్యాడు.

అతడి మకాం రాజధానికి మారింది.

ఇప్పుడు శంకరం పలుకుబడి పెరిగింది అతడి భార్య జానకి మహారాణిలా వెలుగుతున్నది. తెలిసిన వారూ, బంధువులూ ఎందరో శంకరాన్ని చూడవచ్చి గౌరవించి కానుకలిచ్చి వెడుతున్నారు శంకరం తన శక్తిమేరకు వారికి సహాయపడుతున్నాడు. ఆ విధంగా ఒక ఏడాదిలో లక్షరూపాయలు వెనకేశాడు శంకరం.

బావమరిది రంగనాథం ఇంటికి వచ్చే వరకూ తను చాలా గొప్పగా బ్రతుకుతున్నాననే శంకరం భ్రమపడ్డాడు.

రంగనాథం జానకి అన్న. బియస్సీ పాసయ్యాడు. అధికారంలో ఉన్నబావగారి సాయంతో తన అర్హతకు మించిన ఉద్యోగం సంపాదించాలని రాజధానికి బయలుదేరివచ్చి బావగారింట మకాం పెట్టాడు. తీరా అక్కడికి వచ్చేక తను ఏ ఉద్యోగం చేసినా బావగారి అంతస్థుకు తగనివాడే అవుతాడని గ్రహించి ఉద్యోగం విషయంలో తొందరపడలేదు. అతడు బావగారి పరిస్థితిని జాగ్రత్తగా గమనించి ఒకరోజున" అబ్బే లాభం లేదు-నువ్వు నాకు తగ్గ ఉద్యోగం ఇప్పించలేవు" అన్నాడు

"ఏం-ఎందుకని? నాకేం తక్కువయింది?" అన్నాడు శంకరం అదుర్గా.

"ఏం తక్కువ కాలేదని అడుగు! ఎమ్మెల్యేవై ఏడాది దాటింది. ఇంతవరకూ ఒక్కసారైనా నీ పేరు రేడియోలో వినిపించిందా? ఫోటో పేపర్లో పడిందా? నువ్వు ఎక్కడైనా ప్రారంభోత్సవానికి వెళ్ళావా? నీ భార్యను అంటే నా చెల్లిని ఎవరైనా సన్మానించారో? మహిళా సమాజాల్లో దానికి ప్రెసిడెంట్ లాంటి పదవులు వచ్చాయా? చెప్పు..." అన్నాడు రంగనాథం.

శంకరానికి మతిపోయినట్లయింది. "నువ్వు చెప్పింది నిజమే – ఎందుకిలా జరిగింది?" అనడిగాడు.

"ఎందుకేమిటి - నువ్వు మంత్రివి కావు"


"అవును నేను మంత్రిని కాదు. మంత్రిని కావాలంటే నేనేం చెయ్యాలి? ముఖ్యమంత్రి గంగాధరంగారి కాళ్ళమీద పడతాను" అన్నాడు శంకరం.

"బావా ఈమాత్రం నీకు తెలియదు కాళ్ళమీదపడ్డవాళ్ళు ఎమ్మెల్యేలుమాత్రమే అవుతారు. ఎమ్మెల్యే అయినాక తనకాళ్ళ మీద తను నిలబడగలిగినవాడే మంత్రి అవుతాడు" అన్నాడు రంగనాథం.

"నా కాళ్ళమీద నేను నిలబడతాను– ఏంచేయాలో చెప్పు" అంటూ కాళ్ళు జాడించాడు శంకరం.

"నీకు ప్రచారం కావాలి. అబద్ధపు పుకార్లవల్ల మంచి ప్రచారం లభిస్తుంది. నువ్వు మంత్రివి కానక్కర్లేదు–మంత్రివి కానున్నావని చిన్న పుకారులేవదీస్తే పత్రికలన్నీ నీవైపు తిరుగుతాయి. నువ్వు మాత్రం జాగ్రత్తగా ఉండాలి. పత్రికా విలేకరులు నీ యింటికి రావడం మొదలు


## 60 రోజుల ఉచిత వాడకం



నేషనల్ ఆల్ వరల్డ్ ట్రాన్సిష్టర్ సెట్ 170/- లకే పొందే చక్కటి అవకాశం. పోస్టేజి, ప్యాకింగ్, సేల్స్ టాక్స్ కలిపి. ప్రతి ట్రాన్సిష్టర్‌తో పాటు ఒక కాసెట్ ఉచితం.



మీకు తృప్తినివ్వని యెడల త్రిప్పి పంపేయవచ్చు. మీ ఆర్డర్లను ఇంగ్లీష్ లేదా హిందీలోనే క్రింది చిరునామాకు పంపండి.

GENEVA ELECTRONICS (J.H)
P. B. No. 9432, Delhi-110 051.



## రూ॥ 1,00,000 విలువగల బహుమతులు గెలవండి

(ప్రవేశ రుసుము లేదు)

(మాదిరిమొత్తం :36)

| | | |
|---|---|---|
| 11 | 16 | 9 |
| 10 | 12 | 14 |
| 15 | 8 | 13 |

మొదటి బహుమతి : వెస్పా స్కూటర్, కలర్ టి.వి. టు ఇన్ వన్.

కన్సొలేషన్ బహుమతులు :— లేటెస్ట్ ఇంపోర్టెడ్ జపాన్ మోడల్ సోనీ టేప్ రికార్డర్ 175/- లకే (ప్రైస్‌స్కీమ్)

తొమ్మిది ఖాళీ గళ్ళలో 9 నుండి 17 అంకెలను ఒకసారే ఉపయోగిస్తూ ఎటుకూడినా మొత్తం 39 రావాలి.

ఎంట్రీలు 15 రోజుల్లోగా చేరాలి. మొదట చేరిన ఎంట్రీకి రిస్ట్ వాచ్ ఉచితం.

SAJUKI ENTERPRISES (JH)
P. B. No. 9417 Delhi-110 051.

పెట్టారంటే నువ్వు ప్రతీ మాటా తూచి తూచి మాట్లాడాలి. అసలే అంతా అంటూ టూరు. రాజకీయాల్లో ఎమ్మెల్యేకాగానే ప్రజలంటే మరిచిపోతారని!" అని హెచ్చరించాడు రంగనాధం.

"సరే- నా జాగ్రత్తలో నేను ఉంటాను" అన్నాడు శంకరం

శంకరం మంత్రి అవుతున్నాడన్న పుకారు ఇలా లేవగానే అలా ఓ పత్రికా విలేఖరి అతడి ఇంటికివచ్చాడు? శంకరం అతడిని సాదరంగా ఆహ్వానించి మర్యాదలు చేశాడు.

మంత్రికాగనే మీరేం చెయ్యదల్చుకున్నారు?" అన్నాడు విలేఖరి.

"అమెరికా వెడతాను-" అన్నాడు శంకరం— "నా చెవి కింద చిన్నకాయ ఉన్నది. అది అపరేట్ చేయుంచాలి"

"ఇంకా ఏం చేస్తారు?"

"దేశ క్షేమానికి వేసిన కమిటీల్లో నేనూ మెంబర్నవుతాను-"

"ఇంకా?"

"ఇంకా అంటే?" అన్నాడు శంకరం విసుగ్గా.

"అంటే ప్రజలకేం చెయ్యదల్చుకున్నారూ అని"

శంకరం ఉలిక్కిపడి "ప్రజలా? వాళ్ళెవరు?" అన్నాడు.

విలేఖరి తెల్లబోయాడు. పక్కనే ఉన్న రంగనాధం- "బావ అనుకున్నంత పనిచేశాడు. నేను హెచ్చరించటం పొరపాటయింది" అనుకుని "మా బావగారికి ప్రజల్ని దేశాన్ని వేరుచేయటం ఇష్టముండదు అందుకని ఆయన మాటల్లో దేశం అన్న పదంతప్ప ఉపయోగించరు" అన్నాడు.

విలేఖరి సంతృప్తిగా వెళ్ళిపోయాడు.

అప్పుడు శంకరం రంగనాథంతో "నువ్వేదో చెప్పి అతన్ని పంపేయడం బాగానే ఉంది కానీ ప్రజలు అన్న పదం ఎక్కడో విన్నట్లే ఉంది-కానీ ప్రజలంటే ఎవరో గుర్తు రావడంలేదు!" అన్నాడు

రంగనాధం విసుగ్గా "ప్రజలంటే ఎవరేమిటి? దేశంలో ఉండేవాళ్ళు" అన్నాడు.

"దేశంలో మనుషులుంటారు - ప్రజలంటే ఎవరు?"

"ప్రజలంటే మనుషులే!"

"ప్రజలంటేమనుషులే అయితేవాళ్ళకు నేను ఏదో ఎందుకు చేయాలో! ఏం చేశారని ఆ విలేఖరి అడుగుతాడేం? అన్నాడు శంకరం

"ఎందుకంటే నువ్వు ప్రజా సేవకుడివి కాబట్టి నువ్వు ప్రజలకు సేవ చేయాలి"

"అదుగో మళ్ళీ ప్రజాసేవకుడంటున్నావు. ప్రజలూ-మనుషులూ ఒక్కటే అయితే నన్ను మానవసేవకుడనాలి.అలా అనడంలేదు. అంటే ప్రజలు మనుషులు కారు" అన్నాడు శంకరం.

తన బావగారు నిజంగానే ప్రజలంటే మరిచి పోయాడని గుర్తించాడు రంగనాథం. ఈ జాడ్యం వెంటనే కుదర్చాలని అతడు బావగారిని కారులో తీసుకుని వెళ్ళి రకరకాల మనుషుల్ని చూపించి వాళ్ళంతా నీ ప్రజలని చెప్పాడు.

అయితే శంకరానికి వాళ్ళని ప్రజలని ఎందుకు అనాలో అర్థం కాలేదు. అతడు వాళ్ళని బిచ్చగాళ్ళుగా, రిక్షావాళ్ళుగా, కూలివాళ్ళుగా మాత్రమే గుర్తించాడు.

"వాళ్ళే ప్రజలంటే!"

"వాళ్ళే ప్రజలైతే వాళ్ళకోసం నేను ఏదో ఎందుకు చేయాలి?"

"ఎందుకేమిటి? నీకు ఓట్లిచ్చేది వాళ్ళేకదా" అని కొంపదీసి ఓటంటే ఏమిటని అడగవు కదా" అన్నాడు రంగనాధం.

శంకరం అంతపని చేశాడు.

"ఓటంటే నిన్ను ఎమ్మెల్యేని చేసిన ఆయుధం!"

"ఓటు నన్ను ఎమ్మెల్యేని చేసిందా? నన్ను గంగాధరమే ఎమ్మెల్యే చేశాడు. ఓటంటే గంగాధరమా?" అన్నాడు శంకరం.

రంగనాధం ఓటు, ప్రజలు అంటే ఏమిటో చెప్పడానికి శతవిధాల ప్రయత్నించి విఫలుడయ్యాడు. శంకరం మాత్రం ప్రజలంటే ఎవరు, వారికి నేను ఏదో ఎందుకు చేయాలి-అనడం మానలేదు.

శంకరం మంత్రి అవుతాడన్న పుకారు లేచింది కాబట్టి ఇకమీదట ఇంటికి పత్రికావిలేఖరులు అదేపనిగా వస్తూపోతూంటారు. ప్రజలంటే ఏమిటని అతగాడు అడగడం మొదలెడితే పరువు నిలబడదు. అందుకని రంగనాథం బాగా ఆలోచించి తన బావగారికి అస్వస్థతగా ఉన్నదనీ, విజిటర్స్ రాకూడదనీ ప్రకటించాడు.

శంకరానికి నిజంగానే అస్వస్థత అనుకుని ముఖ్యమంత్రి గంగాధరం చూడానికి వచ్చాడు. ఈ విషయం విని గాభరాపడి రంగనాథం బావగారితో "నువ్వు ఆయన మీద గౌరవం కొద్దీ అసలు నిజం చెప్పేయకు" అన్నాడు



హెచ్చరికగా.

అయితే శంకరం గంగాధరానికి అసలు విషయం చెప్పేసి "ప్రజలూ, మనుషులూ ఒక్కటే ఎలాగౌతాకో ఇప్పటికీ నాకు అర్థం కాలేదు" అన్నాడు.

అంతా విని గంగాధరం అతడివంక ముచ్చటగా చూసి "ప్రజల్ని మనుషులు కాదని అనుకోగలగడంలో మంత్రి కావడానికి నీ అర్హత పెరిగింది. కానీ మన దురదృష్టం. మన ప్రభుత్వాన్ని రద్దు చేసి మధ్యంతర ఎన్నికలు జరిపిస్తున్నది కేంద్రం" అన్నాడు.

"ఏమిటీ-మధ్యంతర ఎన్నికలా?" అన్నాడు శంకరం. నాకిప్పుడు ప్రజలంటే గుర్తుకొస్తుంది. వారికేమైనా ఎందుకు చేయాలో అర్థమవుతోంది. ఓటు విలువ తెలుస్తోంది..."

"వెరీగుడ్-ఇప్పుడు నువ్వు మంత్రి కావడానికి పూర్తి అర్హతలు సంపాదించుకున్నావు" అన్నాడు గంగాధరం వెళ్ళిపోబోయే ముందు,

ఆ మర్నాడు జరిగిన విశేషమేమంటే రాష్ట్రంలో మధ్యంతర ఎన్నికలు రాలేదు కానీశంకరం మంత్రి అయ్యాడు.